# ★ అదృష్ట ★ చక్రం

★ కల్లూరి వెంకట్రామ నరసింహమూర్తి ★

రామం ఆమెను చూసిన మొదటిసారే గుడ్డిగా ప్రేమించాడు. ఆమె ఒకచిన్న గ్రామంలో వైద్యంచేస్తూ కొద్దికాలం క్రితమే మరణించిన ఒక డాక్టరు కూతురు. ఆమెతల్లి చాలామందిబంధువుల యిండ్లకువెళ్ళి అచ్చట తన కూతురుకు సంబంధమేదైనా కుదురుతుందేమోనని తిరుగుతు పట్నం వచ్చింది. వారు చాలాబీదవారైనా మర్యాద గల కుటుంబీకులు.

ఆమెపేరు సుగుణ. నిజము ఆమె గుణసంపన్నురాలే. ప్రతివ్యక్తి జీవితానందము కొరకు ఒకమంచి వనిత భార్య గావలెనని కోరుకొనబడే వనితాగణమునకు చెందిన గుణసంపన్న. ఆమెయొక్క పెదవులమీద నాట్యమాడేచిరునవ్వే ఆమెయొక్క పవిత్రాత్మకు ప్రతిబింబము. ఆమెను గూర్చిన స్తుతులే ప్రతిచోట ప్రతిధ్వనించేవి. "ఆమెను పెండ్లాడినవాడిదే జీవితము అంతకంటే మంచిభార్యను పొందలేడు" అని ప్రజలు చెప్పుకోటానికి అలసిపోయేవారుకారు.

రామానికి ఏదో పిత్రార్జితం బాపతు అన్నవస్త్రాలకు లోటులేకుండా యుంది. మంచి హోదాలో యున్నారు. ఇంకగృహస్థు అగుటకు సమయమని తలచి ఆమెను పెండ్లాడేడు.

రామం ఆమెతో సుఖమయ జీవితాన్ని గడుపుతున్నాడు. ఆమె చాలా చాకచక్యంగా పొదుపుగా సంసారంచేస్తూ పైవారెవరూ చాలాదర్జాగా కాపురంచేస్తున్నారని అనుకొనేటట్లు చేసేది. సరసాలు, నవ్వులు, హాస్యాలు మొదలైన వాటితో ఆరేండ్లు గడచినతర్వాత మొదటి రోజులలోకంటే అప్పుడే ఆమెను ఎక్కువగా ప్రేమిస్తున్నానని గుర్తింప గలిగాడు రామం.

కాని రెండేరెండు పనులకు ఆమెను నిందించేవాడు. ఆమెయొక్క సినిమా వ్యామోహము, రెండు కృత్రిమాలంకారములమీద ఆమెకుండే అమితమైనప్రేమ. ఆమెకు స్నేహితురాండ్రగు ఆఫీసర్ల ఆడవారే ఆట మొదటి రోజునే రిజర్వు సీటుచూచి పెట్టేవారు. రోజంతా ఆఫీసుపని చేసివచ్చి బడలికగావున్న రామానికి తనకిష్టం ఉన్నా లేకపోయినా ఆమెతోసినిమాకు వెళ్ళక తప్పేదికాదు.

కొంతకాలమైన తర్వాత తనతో సినిమాకు వచ్చేందుకు స్నేహితురాలి నెవరినైనా చూచుకోమని చెప్పాడు రామం. మొదట ఆమె వ్యతిరేకం చెప్పినా భర్త అనేకసార్లు చెప్పడంవలన అతను సంతోషించేట్టుగా ఆమె అందుకు ఒప్పుకుంది.

సినీమా యందుకంటె తనను తాను అలంకరించుకోవడమందే ఎక్కువ మక్కువకల్గి యుండేది. ఆమె అలంకారాలు దుస్తులు ఏ విధంగా ఉండాలో ఆవిధంగా ఉండేవికావు. ఆమె కొద్దికాలంలో చెవులకు రవ్వలలా మెరిసే రాళ్ళతో చేసిన దుద్దులు మెడలో రత్నాలహారము అలంకరించుకోవటం మొదలుపెట్టింది.

రామంమాత్రం తరచుగా ఆమెను మందలిస్తూ ఉండేవాడు కృత్రిమాలంకారాలు కొని పెట్టుకోవద్దని. "మనం నిజమైన వజ్రాలు కొనుక్కోలేం కాబట్టి స్త్రీజాతికి అరుదైన అభరణమగు సహజ సౌందర్యంతో అలంకరించుకోవాలి" అని అంటూండేవాడు.

అప్పుడామె నవ్వుతూ "ఏం చెయ్యమంటారు? నగలంటే చెవితెగగోసుకుంటాను, అదేనాలో ఉన్నలోటు. ఎవరి మనస్తత్వాలు వారు మార్చుకోలేరుగదా!" అని అంటూండేది.

అప్పుడు రత్నాలహారాన్ని చేతితో ఆడిస్తూ అందులోవున్న పెద్దరత్నాన్ని పైకిచూపిస్తూ భర్తతో "ఇది అందంగా లేదూ? ఎవరైనా సరే ఇవి నిజమైనరత్నాలని చెప్పితీరాలి" అని అనేది.

"నీవన్నీ గొంతెమ్మకోరికలు లెస్తూ" అనే వాడు రామం.

తరచుగా వారిద్దరూ సాయంత్రం సరాగాలాడు చున్నప్పుడు ఆమె తన నగలపెట్టెను రామం దగ్గరకు తీసుకువచ్చి వానినన్నింటిని సరిక్రొత్త ఆనందావిచ్చే వానికిమల్లేచూచి వానినే మక్కువతో చూచిచూచి తనభర్తమెడలో ఒకసారి రత్నాలహారాన్ని వేసి ఎంత అందంగా వున్నారని అంటూ అతని బాహుబంధంలో యిమిడిపోయి చెక్కిళ్ళను ప్రేమార ముద్దు పెట్టుకొనేది

ఒకనాటిరాత్రి ఆమె సినిమాకు వెళ్ళివచ్చి ఆ రాత్రే జ్వరంవచ్చి ఒకవారం రోజులలో ఊపిరి నొప్పితో చనిపోయింది.

ఇంక రామానికి అంతా అంధకారబంధురమే. ఎడతెగని విచారము. ఎక్కడచూసినా ఆమెనవ్వే ఆమె గొంతుకే అతనిమనస్సును వెంటాడుతూం దేది.

కాలమే బాధానివారణి. అదికూడా అతనివిచారాన్ని తగ్గించలేకపోయింది. ఆఫీసులో అందరూ ఆరోజు వార్తల్నిగూర్చి చర్చిస్తూవుంటే అతని కళ్లు నీళ్ళతో నిండిపోయేవి తన భార్యగదిలో పెట్టినవి పెట్టినట్లే ఉండేవి.

కాని జీవితంబాధా జనకమైపోయింది రామానికి తనభార్య యున్నప్పుడు తనరాబడి ఇంటి ఖర్చులకన్నిటికి పుష్కలంగా సరిపోవడమే కాకుండా యింకా మిగిలేది. ఇప్పుడు తనఒక్కని ఖర్చులకు తనరాబడి సరిపోవటంలేదు. అతడు ఆశ్చర్యపోయాడు ఏవిధంగా తనభార్య హాయిగా ఆరాబడితో సంసారం గడిపిందా అని. ఆఖరికి అప్పులుకూడా చేసి బీదవాడై పోయాడు రామం, ఒకరోజున జేబులో చిల్లిగవ్వకూడా లేకపోగా అతని తనభార్య వస్తువులు అమ్మదామన్న ఉద్దేశం కలిగింది. అకృత్రిమ వజ్రాలంటే అతని కెప్పుడూ అసహ్యమే.

ఆమె తన జీవితాంతంవరకూ ఏదో వస్తువును కొంటూనేఉండేది. ఆమెరత్నాలహారాన్ని మొదట అమ్మటానికి నిశ్చయించాడు. దానివలన ఏదో 30 లేక 40రు॥లు వస్తాయనుకొన్నాడు. అవి కృత్రిమమైన వజ్రాలతో చేయబడ్డా పనితనం మాత్రం గొప్పది,

రత్నాలహారం జేబులో పెట్టుకొని రత్నాల వ్యాపారికొట్టు వెతుక్కుంటూ బయలుదేరాడు రామం. మొదట ఒకకొట్టు ప్రవేశించాడు. తన తక్కువతనం, ఆ విలువలేని నగను చూపించటం వల్ల వ్యక్తమౌతుందన్న దుడుకు మనస్సులో పీకుతూనే వున్నాయి.

"అయ్యా! ఈవస్తువు ఎంత విలువ చేస్తుందో చెపుతారా?" అని రత్నాలవర్తకుని అడిగాడు-

వాడు వస్తువును తీసుకొని గుమాస్తాను పిలిచి ఏవో కొన్నిమాటలు నెమ్మదిగాచెప్పి మళ్ళా వస్తువును బల్లమీదపెట్టి తీక్షణంగా చూడసాగాడు.

రామం ఇదంతాచూసి కంగారుపడి 'ఇది అట్టే విలువచెయ్యదని తెలుసు'నని అనబోతూండగా "అయ్యా ఇది రు 1200 లు మొదలు రు 1400 లు వరకు విలువచెయ్యవచ్చును, కాని దీనిని మీరెక్కడ సంపాదించారో చెప్పినగాని దీనిని నేను కొనననే" వర్తకుడు చెప్పాడు,

రామానికి ఆశ్చర్యంవేసింది వర్తకుని మాటలు వినేసరికి. 'అయ్యా మీకూ బాగా తెలుసా——" అని అనబోతుండగా "మీరు యింకా ఇతరచోట్ల చూపించవచ్చు. ఇంకా ఎక్కువ విలువవస్తుందేమో, నేను రు 1400 లు విలువ కట్టినాను—— ఇంతకంటె ఎక్కువ రానిపక్షంలో మరల ఇక్కడకు రండి" అన్నాడు వర్తకుడు.

రామం వస్తువులు తీసుకొని కొట్టు వదలి ఇవత లకు వచ్చాడు. వర్తకుడు చెప్పినమాటలను పున రాలోచిస్తూ తర్వాత తనలోతాను నవ్వుకొంటూ 'పిచ్చివాడు వాడికి మంచిరత్నాలు, కృత్రిమ రత్నాలు గుర్తుపట్టడం తెలియదు" అనుకొన్నాడు

కొద్దిసేపయిన తర్వాత మరియొకకొట్లో ప్రవే శించాడు. వస్తువును చూసీ చూడడంతోనే వర్త కుడు 'ఆ! దీనిని మావద్దనే కొన్నారు' అన్నాడు.

రామం కంగారుపడి "దీనివిలువ ఎంత యుం టుందండీ!" అన్నాను.

"నేను దీనిని రు 1600 లకు అమ్మినాను. ఈ వస్తువు మీకు ఏవిధంగా వచ్చిందో తెలియపరుస్తే నేను దీనిని రు 1500 లకు తీసుకుంటాను" అన్నాడు వర్తకుడు.

రామం మాట్లాడలేకపోయాడు. "కాని.... బాగా పరీక్షించండి, ఇంతవరకూ యివి కృత్రిమ మైన రత్నాలనే భావనలో ఉన్నాను"

'మీపేరు?'

'నాపేరు రామమూర్తి. నేను గవర్నమెంటు ఉద్యోగిని 15. లింగిచెట్టి వీధిలో ఉంటున్నాను

ఆవర్తకుడు పుస్తకాలు తిరగేసి "ఈ రత్నాల హారాన్ని యస్. సుగుణాదేవి, కేరాఫ్ యస్. రామారావు 15. లింగిచెట్టివీధి. అడ్రసుకు 20 జూలై 45వ తేదీన పంపాము" అన్నాడు.

ఒకరినొకరు చూచుకొన్నారు. రామం విశ్చే ష్టుడయ్యాడు. కాని వర్తకుడు రామారావిన్ని దొం గగా తలచాడు

"దీనిని మీరు 24 గంటలు ఉంచి వెడతారా? మీకు రశీదు యిస్తాను.

"తప్పకుండా" అన్నాడు రామం తొందరగా. ఆరశీదు జేబులోపెట్టుకుని కొట్టువదలి వెళ్ళాడు.

బుఱ్ఱలో సుడిగుండాలు తిరుగుతున్నాయి— పిచ్చివానిలా వీధులలో తిరుగుతున్నాడు. విష యాని అవగతం చేసుకుందామని చాలా ప్రయ త్నించాడు. తను అంత విలువగల వస్తువు కొన డానికి తాహతు గలవాడు కాదన్నఅంశం నిర్వి వాదం. అయితే అదియొక బహుమానం అయి వుండాలి. ఎవరివద్దనుండి వచ్చి యుంటుంది? ఎందుకీ బహుమానం?"

అదే ఆలోచిస్తూ ఒకవీధి మధ్యలో నిలబడి పోయాడు. గొప్ప సందేహం కలిగింది. మిగిలిన వస్తువులన్నీ కూడా బహుమానాలేనా? తన కాళ్ళ క్రింద భూమి ఒకసారి వణకసాగింది. ఇటువం టివి బహుమానా లెవరిస్తారు. బహుమానాలు కావు. చెట్లు పడిపోతూన్నట్లు అనిపించింది.... వళ్ళుతెలియక మూర్ఛపోయాడు. ఒక హాస్పిట ల్‌లో కళ్ళువిప్పాడు. తర్వాత యింటికివెళ్ళాడు. తలుపులు వేసుకుని చీకటి పడేవరకూ కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. అల్లా ఏడుస్తూనే తిండి లేక ఆరాత్రి నిద్రపోయాడు.

మర్నాడుదయం ఆఫీసుకు వెళ్ళటానికి ప్రయ త్నించాడు. అంతటి దెబ్బతిన్నతర్వాత పనిచేయ డం చాలాకష్టం అధికారికి ఆ రోజు మాటుకు క్షమించమని ఉత్తరం వ్రాశాడు. మళ్ళా రత్నాల వర్తకుని వద్దకు వెళ్ళాలని జ్ఞాపకంవచ్చింది. వెళ్ల బుద్ధి వెయ్యలేదు. కాని రత్నాలహారం వదలుటకు మనస్కరించలేదు. బట్టలు వేసుకుని బయలు దేరాడు.

ఆరోజు చాలా ప్రశాంతంగా ఆనందమయంగా ఉంది. తీరికగాయున్న వారందరూ సాయంకాలం జేబులో చేతులు పెట్టుకొని వీధులలో తిరుగుచు న్నారు.

వారందరినీ చూచి తనలోతాను ఈ విధంగా అనుకున్నాడు: "ధనవంతులే సౌఖ్యవంతులు. డబ్బుకు ఎంతటి విషాదాన్నయినా మరిపింపజేసే శక్తివుంది. ఎక్కడికైనా వెళ్లవచ్చు. అటువంటి ప్రయాణాల్లోనే విషాదాన్ని మరచే అవకాశాలు చాలావుంటాయి. నేనే ధనవంతుడ నైతే!—"

రామానికి ఆకలివేసింది. కాని జేబులో ఒక్క కాసీఅయినా లేదు. రత్నాలహారం విషయం జ్ఞాపకం వచ్చింది. రు 1500 లు! రు. 500 లే!

రత్నాలవర్తకుని కొట్టుదాకా వెళ్లేడు. చాలా సార్లు లోపలికి వెళ్లాలను కున్నాడు, కాని అవమానం అతనిని వెళ్ళవద్దని వెనకకు నెట్టుతోంది; చాలాఆకలి వేస్తోంది. ఒక్కకాసీ లేదు—ఆకలే మరలా వెళ్లమని ప్రోద్బలం చేసింది.

ప్రొప్రయిటరు వెంటనేవచ్చి కూర్చోమని ఒక కుర్చీ చూపించాడు. గుమస్తాలు ఎరిగియున్నట్లు అతనివైపు చూశారు.

"నేను వాకబు చేశానండీ; మీరు ఈహారాన్ని యియ్యదలచుకొంటే నేను యిదివరకు యిస్తా నన్న సొమ్ము యిస్తాను" అన్నాడు.

"తప్పకుండా అమ్ముతా?" అన్నాడు రామం.

వెంటనే 1500 లు లెక్కపెట్టుకొని రామం జేబులో పెట్టాడు. ఇంక మెట్లుదిగి వెళ్ళిపోబోతూ వెనకకుతిరిగి తలవంచుకుని "నావద్ద—నావద్ద ఇంకా రత్నాలు మొదలైనవి ఈహారం వచ్చిన చోటనుండి వచ్చినవే ఉన్నాయి. అవికూడా మీరు కొంటారా?" అని అడిగాడు.

"తప్పకుండా కొంటామండీ"

"సరే అలాయితే అవితెస్తానని మరి ఒక గంటఆగి మిగిలిన వస్తువులన్నీ తెచ్చాడు. అన్నీ నవరత్నాలతో చేసినవే. అవిఅన్నీ అమ్మగా 20 వేలరూపాయలు వచ్చాయి.

"వారి సంపాదనఅంతా ఈకర్ణాభరణం లోనే ఉంచినట్లు కనబడుతోందే" అన్నాడు వర్తకుడు రవ్వలదుద్దులను చూస్తూ.

"అదోరకం దావరికం" అన్నాడురామం అదో మాదిరిగా.

వెంటనే నగరంలోని పెద్దహోటలుకి వెళ్లాడు. సంతుష్టిగా భోజనం చేశాడు. అప్పుడన్నాడు ప్రక్కనున్న పరిచయస్తునితో "నేనూ ధనవంతుడనే" అని. ఆరోజే తనజీవితంలో మొదటిసారిగా సినిమాఅంటే విసుగుపుట్టని రోజు అతనికి.

మర్నాడు తనవుద్యోగం మానుజ్ఞప్తికివచ్చింది వెంటనే ఆఫీసుకువెళ్లి ఆఫీసరుతో 'అయ్యా! నాకు యిప్పుడే కొంత ఆస్తి ధనరూపేణా వచ్చింది. అందుచే నా ఉద్యోగానికి రాజీనామా నిస్తున్నాను. తన సహచరులందరితో కరస్పర్శలు చేసి తనభావి కార్యక్రమాన్ని సూచించాడు.

తర్వాత అతడు మరలవివాహం చేసుకున్నాడు ఆమె చాల మంచిదేగాని ధూర్తురాలు. తర్వాత అతడు తనజీవితంలోసుఖపడిన రోజులు తక్కువ తక్కువకాదు ఏమిలేవని చెప్పవచ్చు. అదృష్టము చక్రభ్రమణమే గదా!

(మొపాసా ననుసరించి)

---


## ఏజంట్లు కావలెను

"ఆనందవాణి" పత్రికను కమీషనుపద్ధతి మీద విక్రయించడానికి మా ప్రతినిధులు లేని ప్రాంతాలలో ఏజెంట్లు కావలెను. ధరావత్తు కట్టగలిగినవారు ఇతర వ్యాపార షరతులకు ఈ దిగువచిరునామాకు వ్రాయవచ్చును.

మేనేజరు

ఆనందవాణి

12, తంబుచెట్టి వీధి

మద్రాసు - 1